
సాక్షి వికారాబాద్

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



సైబర్ నేరాలపై..

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీస్ ఫోరం ట్రస్ట్ మేనేజర్ హలిగా దయానంద్ అన్నారు. 10లో▶



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. 10లో▶



స్థానిక పోరుపై సందిగ్ధం

స్థానిక ఎన్నికలపై ప్రజల్లో సందిగ్ధత ఏర్పడింది. రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. 11లో▶

న్యూస్‌రీల్

చల్లగా బతకాలి.. అందరినీ బతికించాలి

ఇన్‌చార్జ్ డీపీఓ సంధ్యారాణి



బతుకమ్మ విశిష్టతను విద్యార్థినులకు వివరిస్తున్న సంధ్యారాణి

ధారూరు: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా పంచాయతీ ఇన్‌చార్జ్ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు. విద్యార్థులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చల్లగా బతకాలని.. అందరినీ బతికించాలని ప్రకృతి మనకు నేర్పిస్తుందన్నారు. బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ లక్ష్మి, ధారూరు జీపీ కార్యదర్శి అంజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు లింగాష్టక పారాయణం, అనంతరం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, అష్టోత్తర శతనామావళి, దూపదీపం, నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు ఇస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



నీటి సరఫరా సహాయకులకు సూచనలు చేస్తున్న విజయ్‌కుమార్

బంట్వారం: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ మంచి నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నీటి సరఫరా సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైన లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్, ట్రైనర్ రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, నీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన ఉండాలి

డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

అనంతగిరి: వన్యప్రాణులు, ప్రకృతిపై విద్యార్థులకు అవగాహన ఉండాలని డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలాల వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకున్నప్పుడే మనిషి సురక్షితంగా ఉంటాడని పేర్కొన్నారు.

కొడంగల్: బతుకమ్మతో విద్యార్థిని





తాండూరు టౌన్: చెంగోల్ ప్రాథమిక పాఠశాలలో అందంగా పేర్చిన బతుకమ్మ

తాండూరు రూరల్: మోడల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



శోభితం.. బతుకమ్మ సంబురం

బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 2నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం కావడంతో మంగళవారం విద్యార్థినులు ముందస్తు వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక్కచోటకు చేర్చి ఆడుతూ.. పాడుతూ సందడి చేశారు. సంబరాల్లో ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: బతుకమ్మ సంబరాల్లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు



పెద్దేముల్: స్వామి వివేకానంద పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు

సమీకృతం.. సమాయత్తం

- ఒకేచోట గురుకులాలు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయం
- స్థల పరిశీలన చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్
- త్వరలో పనులు ప్రారంభించే అవకాశం



పాతకొడంగల్ శివారులో గురుకులాల కోసం స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా తలపెట్టిన సమీకృత గురుకుల విద్యా సంస్థల ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది. ఈ నెలలో భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది. పాతకొడంగల్ శివారులోని గిరిజన గురుకులం వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో సమీకృత గురుకులాల కోసం కలెక్టర్ ప్రతీక్ జైన్.. కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇస్తున్న రైతుల వివరాలు, సర్వే నంబర్లు అందజేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పంటలు చివరి దశలో ఉన్నందున కోతలు పూర్తి కాగానే రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

సమస్యలు లేకుండా చూడాలి

పాతకొడంగల్ శివారులోని గిరిజన గురుకులాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల, కళాశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులను చూశారు. విద్యార్థులకు చిన్నపాటి ఇబ్బంది కూడా కలగకుండా చూడాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు సూచించారు. పాఠశాలకు సరఫరా చేసిన ఫ్యాన్లు, హైమాస్ట్ లైట్ల వినియోగాన్ని పరిశీలించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రిన్సిపాల్‌ని అడిగారు. నీటి సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ కొడంగల్ మున్సిపల్ అధికారి బలరామ్‌కు సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఎంపీడీఓ ఉషశ్రీ, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం నగరం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని పూర్తి చేశారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్

పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అనంతగిరి: గాంధీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి డీటీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూమ్, సీనియర్ నాయవాదులు మాధవరెడ్డి, యాదవరెడ్డి, శంకరయ్య, యాదయ్య, నర్సింలు, ఆనంద్ పాల్గొన్నారు.



కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి తదితరులు

అప్రమత్తంగా ఉండండి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

మర్పల్లి: శాంతిభద్రతలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పనితీరు మెరుగు పరచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఏయే గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.. వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద, సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా నేరాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, పేకాట, మట్కా వంటి వాటిని కట్టడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ ఎన్ శ్రీనివాస్ రెడ్డి, మర్పల్లి ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్పీకి ఎస్ఐ సురేష్ మొక్కను బహూకరించారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

సరదాగా గడిపి.. సమస్యలపై ఆరా తీసి..

ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో సరదాగా గడుపుతూ గురుకులంలోని సమస్యలపై కలెక్టర్ శశాంక ఆరా తీశారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ గురుకుల బాలుర హాస్టల్‌లో సోమవారం రాత్రి ఆయన బస చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున విద్యార్థులతో మార్నింగ్ వాక్ చేసి, కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. రాత్రి బసలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి సమస్యలను గురుకుల సొసైటీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

- పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి
- రైతుల భూములను బలవంతంగా లాక్కుంటే ఉద్యమిస్తాం
- సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాస్

బషీరాబాద్: కార్మికులు, కర్షకుల తరపున సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో తాండూరులో జరిగే పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం బషీరాబాద్‌లో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాసభల్లో జిల్లాలోని పేదలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పేరుతో కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటున్నారని, వారికి అండగా పోరాటం చేస్తామని తెలిపారు. ఎన్నికల హామీలు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు భరోసా రెండు విడతల నిధులు విడుదల చేయాలన్నారు. రుణమాఫీ కాని రైతుల పక్షాన ఉద్యమిస్తామని చెప్పారు. తాండూరులో కాలుష్య నియంత్రణకు, కంది బోర్డు ఏర్పాటుకు తీర్మానం చేయనున్నట్లు వివరించారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలు, కార్మికులకు, అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, వెంకటేష్ ఎమ్మార్పీఎస్ నాయకుడు కృష్ణ, సీఐటీయూ నాయకులు చందు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అందని జాబితా

- మొదటి రోజు ఆగిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- సాయంత్రం వరకు ఎదురుచూసి వెనుదిరిగిన అభ్యర్థులు



వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థులు

అనంతగిరి: డీఎస్సీ అర్హుల జాబితా అందకపోవడంతో మొదటి రోజు(మంగళవారం) అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఆగింది. సాయంత్రం 5గంటల వరకు ఎదురు చూసిన అభ్యర్థులు జాబితా విడుదల కాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన నేపథ్యంలో మంగళవారం జిల్లాలకు 1:3 జాబితా వస్తుందని అభ్యర్థులు ఆశగా ఎదురు చూశారు. అధికారులు ఎంపిక చేసిన కేంద్రాలకు సర్టిఫికెట్లతో అభ్యర్థులు వచ్చారు. ఎస్‌జీటీ అభ్యర్థుల కోసం వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలను ఎంపిక చేయగా, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, పండిట్ కోసం శివారెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్‌ను కేటాయించారు. విద్యాశాఖ అధికారులు కౌంటర్లను ఏర్పాటు చేసి ధ్రువపత్రాల పరిశీలనకు సిద్ధమయ్యారు. అయితే సాయంత్రం 5గంటల వరకు జాబితా రాలేదు. కేంద్రాలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించారు. బుధవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరగనున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

డీఎస్సీలో 10వ ర్యాంక్


శ్రీహరి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన చిలుముల శ్రీహరి సోమవారం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయి 10వ ర్యాంకు సాధించాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోగా.. తల్లి పద్మమ్మ, మేనమామ పిరంగి శ్రీనివాస్ సహకారంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు.

తొమ్మిది మందికి రిమాండ్

పూడూరు: వినాయక నిమజ్జన ఉత్సవాల్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన తొమ్మిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వీరు సెప్టెంబర్ 15న పూడురులో వినాయక నిమజ్జనం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను అసభ్యపదజాలంతో దూషించడంతో పాటుగా విధులలకు ఆటంకం కలిగించారన్నారు. ఈ మేరకు పూడూరు గ్రామానికి చెందిన చన్గోముల్ సుజాత, మల్లెగట్ల మల్లేశం, ఎర్ర శ్రీనివాస్, గొర్రెంక అరిల్, ఈడిగి నర్సింలు, చాకలి పాండు, పిచ్చకుంట్ల శ్రీశైలం, ముడిమ్యాల జంగయ్య, ప్యాట శేఖర్‌పై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు వినతి


డీఎస్పీ బాలకృష్ణా రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పట్టణవాసులు

తాండూరు టౌన్: ట్రాఫిక్ నియంత్రించాలని కోరుతూ పలువురు పట్టణవాసులు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ చౌక్, వినాయక్ చౌక్, భద్రేశ్వర్ చౌక్‌లలో తోపుడు బండ్లు, ఆటోలు రోడ్డు పై నిలుపుతుండడతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దసరా, దీపావళి నేపథ్యంలో ప్రజలు రద్దీ ఎక్కువగా ఉంటుందని కాని స్టేబుల్స్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ వాసులు సంతోష్, మల్లేశం, రామకృష్ణ, కిరణ్, లక్ష్మణాచారి, సతీశ్, శ్రీనివాస్, సందీప్ రెడ్డి తదితరలున్నారు.

డిమాండ్లను సాధించుకుందాం

ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మధు

కొడంగల్ రూరల్: ఒగ్గు పూజారుల గోసను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మన డిమాండ్లను సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఒగ్గు మధు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మహదేవుడి ఆలయంలో గడప గడపకూ సంక్షేమ యాత్ర కార్యక్రమాన్ని సీనియర్ ఒగ్గు కళాకారులు ప్రారంభించారు. ఈ యాత్రతో కళాకారులను సంఘటితం చేద్దామన్నారు. కళాకారులకు ఐడీ కార్డులు, ఇన్సూరెన్స్, పింఛన్లు, సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు అందించాలనే డిమాండ్‌తో యాత్రను చేపడదామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఉస్తాద్ ఒగ్గు రవి, రాష్ట్ర కోశాధికారి గజర్ల బుగ్గన్న, ఒగ్గుకళ సామ్రాట్ చుక్క సత్తయ్య కుమారుడు చుక్క అంజయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఒగ్గు మైపాల్, జిల్లా అధ్యక్షుడు పూజారి శాంతప్ప, ప్రధాన కార్యదర్శి ఒగ్గు బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ క్వింటాల్ రూ.4,500


ఐనెల్లిలో ఆరబెట్టిన సోయాబీన్

తాండూరు రూరల్: సోయాబీన్ పంట క్వింటాల్‌కు రూ.4500 ధర లభించింది. మండలంలోని ఐనెల్లి గ్రామంలో రైతులు 200 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేస్తున్నారు. నాలుగు నెలల్లోనే చేతికి వచ్చే పంట అవ్వడంతో ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట అనంతరం ఉల్లిని సాగు చేస్తారు. క్వింటాల్‌కు రూ.4,500 ధర రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రాయికల్ టోల్‌ప్లాజా


కొత్తూరు వద్ద సర్వీస్ రోడ్డు దుస్థితి

‘టోల్’ వసూల్.. నిర్వహణ నిల్

రోడ్డుపై పేరుకుపోతున్న మట్టి, కంకర

- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని ‘ఇసాదక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్’


వర్షానికి రోడ్డుపై చేరిన మట్టి

కొత్తూరు: వాహనదారుల నుంచి టోల్ ఫీజుల రూపంలో లక్షలు వసూలు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ రోడ్డు నిర్వహణను గాలికొదిలేసింది. కేవలం వసూళ్లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో వర్షాలకు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, లారీల్లో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న క్రమంలో రోడ్డుపై పడుతున్న కంకరతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్‌ప్లాజా వరకు రోడ్డు నిర్వాహణ అస్తవ్యస్తంగా తయారైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసాదక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కొత్తూరు నుంచి జడ్చర్ల వరకు సుమారు 46 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్వహణ బాధ్యతలు చేపడుతోంది. ఈ సంస్థ షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయగా ప్రతీ రోజు సుమారు 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

నిర్వహణలో నిర్లక్ష్యం

- కొత్తూరు నుంచి జడ్చర్ల వరకు 46.162 కిలోమీటర్ల మేర ఇసాదక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రోడ్డు నిర్వహణ బాధ్యతలు చేపడుతోంది.
- ఈ సంస్థ పరిధిలో వాహనదారుల కోసం 32 చోట్ల బస్టాప్‌లు, నీటిట్యాంకులు ఏర్పాటు చేశారు. కాగా ఎక్కువ చోట్ల ట్యాంకుల్లో సక్రమంగా నీటిని నింపడం లేదు. కొన్నిచోట్ల ట్యాంకులు ఏర్పాటు చేసిన కుళాయిలు ధ్వంసమయ్యాయి. దీంతో నీటికి ఇబ్బందులు తప్పడం లేదు.
- జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తు అత్యవసర సమయాల్లో సాయం కోసం సంస్థ తన పరిధిలో 46 ఎస్ఓఎస్ ఫోన్లను ఏర్పాటు చేసింది. కానీ వీటిపై వాహనదారులకు అవగాహన లేక వినియోగించడం లేదు.
- హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో కూడళ్ల వద్ద రోడ్డు దాటే క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- వర్షాలు కురిసినప్పుడు రోడ్డు ఎత్తు తక్కువగా ఉన్నచోట వరద నీరు, మట్టి చేరుతుంది. కాంట్రాక్ట్ సంస్థ మట్టి తొలగింపు చర్యలు తీసుకోకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- పెంజర్ల, జేపీదర్గా కూడళ్ల వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్లే లారీల నుంచి కంకర రోడ్డు పై పడుతోంది. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు, వాహనాలు ప్రధాన రోడ్డుపైకి రాకుండా కాంట్రాక్ట్ సంస్థ సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేసింది. కాగా వాటికి నిర్వాహణ లేక వాహనాల రాకపోకలు కొనసాగడం లేదు.

వెంటనే స్పందిస్తాం



కొత్తూరు నుంచి జడ్చర్ల సమీపం వరకు ఇసాదక్ సంస్థ రోడ్డు నిర్వాహణ బాధ్యతలు చేపడుతోంది. నిత్యం పెట్రోలింగ్ సిబ్బంది సంస్థ పరిధిలోని రోడ్లను పరిశీలిస్తుంటారు. మట్టి, రాళ్లు, ఇతర వస్తువులు పడితే వెంటనే తొలగిస్తారు. ఒకవేళ సిబ్బంది గమనించని పక్షంలో వాహనదారులు, స్థానికులు సమాచారం ఇచ్చినా వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. ప్రమాదరహిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి.
– ఇబ్రహీం, రాయికల్ (ఇసాదక్)టోల్‌ప్లాజా, మేనేజర్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు


రాతికట్టడాన్ని ఢీకొట్టి ఆగిపోయిన లారీ

- బస్ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
- లారీ డ్రైవర్ పరార్

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో లారీ బస్సును ఢీకొట్టింది. బస్ డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మంగళవారం తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ సంతోష్ కుమార్, ఆర్టీసీ అధికారి తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి డిపో నుంచి 92 మంది ప్రయాణికులతో ఓ బస్సు తాండూరు వైపు ప్రయాణిస్తోంది. బస్సు అంతారం శివారులోకి రాగానే నాపరాతి లోడ్‌తో అతివేగంగా వస్తున్న లారీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు పక్కభాగాన్ని ఢీకొడుతూ ముందుకు వెళ్లింది. దీంతో బస్సు అద్దాలు, రెయిలింగ్ పగిలిపోయాయి. అప్రమత్తమైన బస్ డ్రైవర్ ఎండీ.అన్సార్ అతికష్టంగా అదుపుచేసి వాహనాన్ని పక్కకు నిలిపాడు. లారీ పక్కనే ఉన్న ఓ రాతి కట్టడాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో అన్సారీ చేతికి స్వల్ప గాయమవ్వగా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా లారీ డ్రైవర్ వెంటనే పరారయ్యాడు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాండూరు కోర్టు మెజిస్ట్రేట్ ప్రత్యేక పూజలు


మెజిస్ట్రేట్ శివలీల దంపతులను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో తాండూరు కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివలీల ప్రత్యేక పూజలు చేశారు. మెజిస్ట్రేట్ శివలీల దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి మెజిస్ట్రేట్ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, కోర్టు సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

1.9 కిలోల గంజాయి, 400 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం


టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న గంజాయి, చాక్లెట్లు

తాండూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటన తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. నిషేధిత గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా ఒడిశా రాష్ట్రం పూరి ప్రాంతానికి చెందిన అనిల్ కుమార్ దాస్ వద్ద 400 గ్రాముల గంజాయి చాక్లెట్లు, 1.9కిలోల గంజాయి పౌడర్ లభ్యమైందన్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీలో ఎస్ఐలు ప్రేమ్‌కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ జిల్లా జట్టులో వెల్జాల్ విద్యార్థులు

తలకొండపల్లి: ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీల్లో సత్తా చాటిన వెల్జాల్ విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ పరమేశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రికెట్ అండర్–14 విభాగంలో బి.కార్తీక్, టి.శివశంకర్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో చోటు సాధించారన్నారు. బుధవారం నగరంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

సెలవులొచ్చె.. ఇల్లు పిలిచె

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. దీంతో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మంగళవారం జినుగుర్తి గేటు వద్ద ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. 15వ తేదీన పాఠశాల లు పునఃప్రారంభమవుతాయని ఉపాధ్యాయులు తెలిపారు.

బడికి బై బై

దుద్యాల్: నేటి నుంచి పాఠశాలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో మంగళవారం విద్యార్థులు పాఠశాలలకు బాయ్ బాయ్ చెప్పారు. దీంతో విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఎంతో ఆనందంతో ఎగిరి గంతులేశారు. పాఠశాలలు తిరిగి ఈ నెల 15న ప్రారంభకానున్నాయి.


తాండూరు రూరల్: హాస్టల్ నుంచి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

సత్తా చాటిన కోట్‌పల్లి విద్యార్థులు


డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ చేతులమీదుగా బహుమతులు అందుకుంటున్న కోట్‌పల్లి విద్యార్థులు

బంట్వారం: జాతీయ వన్యప్రాణి పరిరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో కోట్‌పల్లి విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా స్థాయి పోటీల్లో కోట్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన వర్షిత, ఉమ్రాన్ మొదటి, శ్రీనివాస్ తృతీయ, రాంపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పవన్, మహీన్ ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్ మోత్కుపల్లి విద్యార్థి వైష్ణవి తృతీయ బహుమతులు సాధించారు. జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఎంఈఓ చంద్రప్ప విజేతలను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పీస్ ఫోరం ట్రస్ట్ మేనేజర్ దయానంద్


మాట్లాడుతున్న ట్రస్ట్ మేనేజర్ దయానంద్

మోమిన్‌పేట: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీస్ ఫోరం ట్రస్ట్ మేనేజర్ హలిగా దయానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీస్ ఫోరం ట్రస్ట్ ఆధ్వర్యంలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ వారు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. ప్రతీ రోజు వందల సంఖ్యలో సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు అమాయకులైన వారి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు మాయం చేస్తున్నారన్నారు. ఫోన్‌కు వచ్చే అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయొద్దు అన్నారు. కస్టం అధికారులమంటూ భయభ్రాంతులకు గురిచేసి డబ్బు లాగుతారని వారిపట్ల జాగురూకతతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ బండారు అశోకవర్ధన్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఏఎస్ఐ పుండరీకం తదితరులున్నారు.

ఒక్కొక్కటిగా హామీల అమలు

డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ

పరిగి: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గడిసింగాపూర్, మల్కాయపేట తండా, హిర్యానాయక్‌తండా, ఇబ్రహీంపూర్ తదితర గ్రామాల్లో రూ.500 గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం నిలువునా దోపిడీ చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఖరీం, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు రాంరెడ్డి, తౌర్యానాయక్, వెంకట్రాములు, శ్రీను పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

మున్సిపల్ అత్యవసర సమావేశం

ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: దసరా పండుగను పురస్కరించుకుని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్ అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి సేవలందించిన చీకటిమర్ల విశ్వనాథం ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం దసరా ఉత్సవాలకు చేయాల్సిన పనుల ఎజెండాను ప్రవేశపెట్టారు. ఇందులో ఆలంపల్లిలో రావణదహనం, గంగారం, కొత్తగడి, అనంతగిరిపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, ధన్నారం, వెంకటపూర్ తండా, ఎన్నెపల్లి, రాజీవ్‌గృహకల్ప, శివరాంనగర్ తదితర కాలనీల్లో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ఎజెండాను కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరగడానికి సహకరించి ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్ సభ్యులకు చైర్‌పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

వికారాబాద్ మున్సిపల్ డీఈగా పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రశాంత్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈ రాకేష్‌రెడ్డికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

స్పీకర్‌పై వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నాం

బీఆర్ఎస్ నాయకులు

మర్పల్లి: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలను వెనక్కి తీసుకుంటున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మర్పల్లిలోని ఓ పంక్షన్ హాల్‌లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఇటీవల పలుమార్లు తమ డిమాండ్‌ను వినిపించామని చెప్పారు. ఇది జీర్ణించుకోలేని కొంతమంది కాంగ్రెస్ నాయకులు తమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తో పాటు బీఆర్ఎస్ నేతలపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. దీనికి కౌంటర్‌గా తాము కూడా కాంగ్రెస్ నేతలపై ప్రత్యారోపణలు చేశామన్నారు. కానీ స్పీకర్ స్థానాన్ని గౌరవిస్తూ ఆయనపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరిపురం రమేశ్, మధుకర్, రమేష్‌మిత్ర, ఖాజా ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

యువతి అదృశ్యం



మొయినాబాద్: ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి తెలిపిన ప్రకారం.. నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన బంటు మానస(19) నగరంలో ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తోంది. సోమవారం ఉదయం 6.40గంటలకు మానస అన్న మహేందర్ బైక్‌పై అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద డ్రాప్ చేశారు. రాత్రైనా యువతి ఇంటికి రాకపోవడంతో జాబ్ చేసే ప్రదేశంతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో కుటుంబ సభ్యులు మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన బస్టాండ్


నవరాత్రి ఉత్సవాలు, దసరా సెలవుల నేపథ్యంలో పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణం మంగళవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు చేరేందుకు వస్తుండడంతో బస్టాండ్‌లో సందడి వాతావరణం నెలకొంది. వరుస పండగల నేపథ్యంలో ప్రయాణికుల తాకిడి పెరిగింది.
– కొడంగల్ రూరల్